ప్రజాశక్తి

ఆదివారం 3 నవంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

డిఆర్‌సికి
నివేదికలు సిద్ధం చేయండి..

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు వాటి ప్రస్తుత స్థితిగతులు, ప్రభుత్వం నుంచి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని తెలియజేసేలా డిఆర్‌సి సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ నెల 4న జిల్లా ఇన్‌ఛార్జి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన డిఆర్‌సి సమావేశం ఉండటంతో శనివారం కీలకమైన శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ ముందస్తు సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిపై ఆరాతీశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న శాఖలలో జరుగుతున్న పనులను పూర్తి చేయడానికి, ముఖ్యంగా వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాసం, జల్‌జీవన్ మిషన్, జిల్లాకు విత్తనాలు, ఎరువుల డిమాండ్ సరఫరా, ఇరిగేషన్ మరమ్మతులు, ఇతర నిర్మాణాలు, పెండింగ్ విల్లులు, కొత్త ప్రతిపాదనలతో కూడిన వివరాలను సమగ్రంగా పొందుపరచాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, సిపిఒ డి. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఈ దేవానందం, ప్రాజెక్ట్స్ ఎస్ఈ. అబూత్ అలీం, ఇరిగేషన్ ఎస్ఈ. వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి గోపీచంద్, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ పివి రమణ, డిఎం,హెచ్ఒ డాక్టర్ డి.సురేష్ కుమార్, డి.సి. హెచ్. ఎస్. సూరిబాబు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాదేవి, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర కుమార్ పాల్గొన్నారు.

విష వాయువులు లీకై..
100 మందికి అస్వస్థత

- నలుగురి పరిస్థితి విషమం
- నిజాంపట్నం రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో కెమికల్ రియాక్షన్
- తీవ్ర అస్వస్థతకు గురైన మహిళా కార్మికులు
- ఎవరికీ ప్రాణాపాయం లేదు: కలెక్టర్

ప్రజాశక్తి-నిజాంపట్నం, బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా, నిజాంపట్నం పంచాయతీ గోకర్ణమఠం గ్రామంలోని రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో శనివారం ఉదయం విషవాయువులు లీకైన కారణంగా అక్కడ విధుల్లో ఉన్న మహిళా కార్మికులు ఊపిరాడక భయాందోళనలతో బయటకు వచ్చి వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తెలియవచ్చిన సమాచారం మేరకు,...నిజాంపట్నం రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ లో శనివారం సుమారు 400 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. అత్యధికులు మహిళా కార్మికులు ఇక్కడ పనిలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రాసెసింగ్ యూనిట్లో విషవాయువులు ఒక్కసారిగా లీక్ అవడంతో దాంట్లో పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కొందరు, ఉక్కిరిబిక్కిరై కొందరు, అక్కడే స్పృహ కోల్పోయారు. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. సుమారు 200 మంది మహిళలు అస్వస్థతకు గురికాగా వారిలో 100 మందిని నిజాంపట్నం వైద్యశాలకు తరలించారు. అందులో 35 మందికి ఊపిరాడకపోవడంతో ▶ 2లో

ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సిహెచ్ మణిలాల్

సిపిఎం జిల్లా ప్రథమ మహాసభలు..
ప్రజాపోరాటాలకు నాంది పలకాలి..

- ఈ నెల 31, డిసెంబర్ 1 తేదీల్లో నిర్వహణ
- పార్టీ బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజా పోరాటాలకు ప్రజాతంత్ర ఉద్యమాలకు సిపిఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు నాంది పలకాలని పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ప్రథమ మహాసభ ఆహ్వాన కమిటీ ఏర్పాటు సమావేశంలో గంగయ్య మాట్లాడారు. ఈ నెల 31, డిసెంబర్ ఒకటో తేదీల్లో బాపట్లలో పార్టీ జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించడం జరుగుతోందన్నారు. అందుకు కావాల్సిన సన్నాహక సమావేశాన్ని ఈ సందర్భంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గంగయ్య మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో రైతాంగ ఉద్యమాలు, కార్మిక పోరాటాలు, వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. బాపట్ల జిల్లా అభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటు తీర ప్రాంతంలో సహజ వనరుల వినియోగం, జిల్లా సమగ్ర అభివద్ధికి ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలపై మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రైతులు, రైతు కూలీలు, కార్మికులు, విద్యార్థులు, యువజనులు, అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో సమగ్రంగా చర్చించడం జరుగుతుందని తెలిపారు.

వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన జిల్లాలో వ్యవసాయ అభివద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికపై మహాసభలో ప్రధానంగా చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో విశ్రాంత అధ్యాపకులు కారుమంచి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు దళారీ వ్యవస్థ నుండి ప్రభుత్వాలే కాపాడాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు పురుగుమందులు అవసరం మేర రుణ సదుపాయం కల్పించి విత్తనం నుండి పంట విక్రయం వరకు ప్రభుత్వమే జవాబుదారీతనంగా వ్యవహరించి వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్ళైనా రైతుల అభివద్ధికి ప్రభుత్వాలు మూస పద్ధతినే అవలంబిస్తున్నాయన్నారు

ప్రముఖ న్యాయవాది షేక్ జమ్రుద్‌బాషా మాట్లాడుతూ అనేక చట్టాలు ▶ 2లో

చేనేత సహకార సంఘాల
ఎన్నికలకు కసరత్తు

- జిల్లాలో ఉన్న చేనేత సంఘాలు 71
- మనుగడలో ఉన్న సంఘాలు 33
- కొత్త సంఘాల ఏర్పాటుకు అవకాశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చేనేత సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నారు. నూతనంగా సహకార సంఘాలను ఏర్పాటు చేయడంతో పాటు నిద్రాణస్థితిలో ఉన్న చేనేత సంఘాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. చేనేత కార్మికులకు సంబంధించి సంక్షేమ, అభివద్ధి పనులు గతంలో చేనేత సహకార సంఘాల ద్వారా అమలయ్యేవి. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సహకార సంఘాల గురించి పట్టించుకోలేదు. తాము అధికారంలోకి వస్తే చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తామని ప్రకటించారు కానీ తీరా అధికారంలోకి వచ్చాక కేవలం నేతన్న హస్తం పథకం మాత్రమే అమలు చేశారు. గడచిన ఐదేళ్ల కాలంలో ఎన్నికలు నిర్వహించలేదు. నామినేటెడ్ పోస్టుల ద్వారా త్రిసభ్య కమిటీలను నియమించారు. ఈ కారణంగా చేనేత సహకార సంఘాలు నిర్వీర్యం అయ్యాయి. చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాలను నియమించి నేతన్నల కోసం మెరుగైన సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరుపనున్నారు.

బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 16 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో సుమారు 9 వేల చేనేత కుటుంబాలు ఉండగా, ఇందులో 1,968 మంది సహకార రంగంలో, 14,670 మంది సహకారేతర రంగంలో 1,500 మంది చేనేత అనుబంధ వృత్తుల్లో ఉన్నారు. జిల్లాలో 10 వేల వరకు నేత మగ్గాలు, 71 చేనేత సహకార సంఘాలు ఉండగా ప్రస్తుతం 33 సంఘాలు మనుగడలో ఉన్నాయి. త్వరలోనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ మేరకు చేనేత, జౌళి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. చేనేత సంఘంలో ▶ 2లో

విషవాయువులు లీకై.. 100 మందికి అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

ఆక్సిజన్ అందించే ఏర్పాట్లు చేశారు. వారిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

కార్మికులను ఆదుకోవాలి

రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ప్రమాదానికి గురై వైద్యశాలలో ఉన్న కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై కేసు నమోదుచేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆయన మాట్లాడుతూ రోజువారీ ఉపాధిలో భాగంగా నిజాంపట్నం చుట్టుపక్కల కర్లపాలెం, బాపట్ల, పిట్లవానిపాలెం మండలాల్లోని వివిధ గ్రామాల పేద మహిళలు ఎప్పటిలాగానే రొయ్యలు ప్రాసెసింగ్ కంపెనీలో పనికి వెళ్లారన్నారు. యాజమాన్యం నైపుణ్యం లేని సూపర్‌వైజర్స్‌ను నియమించడం వల్ల క్లీనింగ్ చేయటానికి అవసరమైన కెమికల్ కాకుండా మరో ప్రమాదమైన కెమికల్ ఉపయోగించడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందన్నారు. కంపెనీలో 30 నిమిషాల వ్యవధిలోనే వంద మందికి పైగా అనారోగ్యం పాలైయారని, ఈ ఘటన కేవలం యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆరోపించారు. ఎటువంటి కార్మిక చట్టాలు, జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే జరిగిందన్నారు. వైద్యం పొందుతున్న వారికి రూ.50వేల నుండి రూ.లక్ష వరకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. శనివారం విధులకు వచ్చిన కార్మికులందరికీ ఆరోగ్యం పూర్తిగా బాగుపడే వరకు యాజమాన్యం బాధ్యత తీసుకుని, జీతాలు చెల్లించాలని వినతిపత్రం అందించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. కార్యక్రమంలో సిఐటియు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కె రమేష్, ఎన్ శివశంకర్, ప్రహ్లాదుడు, సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందిస్తుంది..

నిజాంపట్నం సీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లో జరిగిన ప్రమాదంలో అస్వస్థత గురైన వారందరికీ ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందిస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు.నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలోని రాయల్ మెరైన్ సి ఫుడ్ ప్రాసెస్ సింగ్ యూనిట్ లో శనివారం ప్రమాదం జరిగింది. ప్రమాద దుర్ఘటనపై సమాచారం తెలుసుకున్న కలెక్టర్ హుటాహుటిన 108 అంబులెన్స్ వాహనాలను నిజాంపట్నం తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. సహాయక చర్యల నిమిత్తం రేపల్లె ఆర్డిఓ ను అప్రమత్తం చేశారు. వెను వెంటనే అక్కడకు చేరుకున్నారు. అస్వస్థతకు గురైన వారిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అప్పటికే నిజాంపట్నంలోని ఏరియా వైద్యశాలలో వైద్యం పొందుతున్న వారి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఏ ఒక్కరి ప్రాణాలకు హాని ఉండదని, వైద్యానికి అయ్యే ఖర్చు అంతా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని వారందరికీ కొండంత భరోసా ఇచ్చారు. సమీపంలోని వైద్యశాలల వైద్యులు, సిబ్బందిని అక్కడికి పిలిపించారు. 110 మందిని ఆసుపత్రికి తరలించగా అందులో 25 మంది ఆరోగ్యం బాగానే ఉండడంతో వారిని ఇళ్లకు పంపి వేశారు. 54 మందికి ప్రథమ చికిత్స ఇవ్వడంతో వారి ఆరోగ్యం కుదుట పడిందని, ఆస్పత్రి వద్దనే ఉంచామని వైద్యులు కలెక్టర్ దష్టికి తెచ్చారు. 31 మందిని ఇన్ పేషెంట్లుగా చేర్చి వైద్యం అందిస్తున్నామని, నలుగురు తీవ్ర అస్వస్థతకు గురవడంతో గుంటూరు తరలించామన్నారు. వారిలో ఇద్దరు ప్రైవేట్ వైద్యశాలలో చేర్చాలని కోరడంతో ఆ ఖర్చంత ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. బాధితులైన వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. శ్వాస తీసుకోవడం కొంచెం ఇబ్బందిగా ఉండటం వల్లనే నలుగురిని గుంటూరు తరలించామన్నారు. ఎవరి ప్రాణాలకూ హాని లేదన్నారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, డిసిహెచ్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

చేనేత సహకార సంఘాల ఎన్నికలకు కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులుగా ఉన్నవారు తమ నుంచి 9 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. నిబంధనల ప్రకారం వీరిలో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలి. ఎన్నికైన 9 మంది డైరెక్టర్ల నుంచి అధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. జిల్లాలో ఎన్నికయిన చేనేత సంఘాల అధ్యక్షులందరూ కలిసి ఆప్కో డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఆప్కో డైరెక్టర్లు అందరూ కలిసి ఆప్కో ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు.

చేనేత సహకార సంఘాల ఎన్నికలతో నేతన్నలకు అనేక ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉంది. గత ప్రభుత్వం చేనేత సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. చేనేత కార్మికులకు, సంఘాలకు ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయంతో చేనేత సంఘాలకు, నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుంది. గత టీడీపీ హయాంలో అమలైన మార్కెట్ ఇన్సెంటివ్, యార్న్ సబ్సిడీ, థ్రిఫ్ట్ ఫండ్, ముద్ర రుణాలు వంటి పథకాలను కూటమి ప్రభుత్వం అమలులోకి తేనుంది. ఇలా పథకాల పునరుద్దరణ ద్వారా చేనేత సంఘాలకు ప్రయోజనం కలుగుతుంది. ఎన్నికలు జరపడంతో పాటు చేనేత కార్మికుల ఆర్థికాభివద్ధి లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేయనున్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపు, చేనేతలకు ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా శిక్షణ ఇచ్చి తయారైన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించనున్నారు. చేనేతకు నగదు రహిత వైద్యమందించేలా బీమా సదుపాయం అమలు చేయనున్నారు.

మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నూలుపై 15 శాతం సబ్సిడీ, దీంతో పాటు 2014-19 మధ్య అమలు చేసిన అన్ని పథకాలనూ చేనేతలకు అమలు చేయనున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ముద్రా రుణాలపై చేనేత కార్మికులకు వ్యక్తిగత, సామూహిక రుణాలు ఇస్తారు. చీరాలలో నూతన టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివద్ధికి తగిన చర్యలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చేనేతలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రజాపోరాటాలకు నాంది పలకాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాసంఘాల పోరాటాలకు అవరోధంగా ఉన్నాయన్నారు. కార్మికుల, ప్రజలకు న్యాయమైన పోరాటాలకు అవసరమైన చట్టాల ఆవశ్యకతపై మహాసభలో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల హక్కులను కాలరాసే చట్టాల్లో మార్పులు తేవాలని అన్నారు. మహాసభకు ఆహ్వాన కమిటీ అధ్యక్షులుగా షేక్ జమ్రుద్‌బాషా, కార్యదర్శి సిహెచ్ గంగయ్య, కోశాధికారి కె.నాగేశ్వరరావు, పాట్రన్ కమిటీ సభ్యులు నియామకం జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు కొండయ్య, న్యాయవాది భీమా లీలాకష్ణ, పార్టీ సీనియర్ నాయకులు వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, పట్టణ కమిటీ కార్యదర్శి భోగి రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయ లక్ష్యంతో జిల్లా లోని అన్ని శాఖలకు చెందిన రోడ్ల మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. మండలంలోని మద్దులూరు గ్రామంలో మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్థానిక ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్‌తో కలిసి రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పాట్ హోల్ ఫ్రీ రోడ్స్ అనే కార్యక్రమాన్ని అనకాపల్లిలో ప్రారంభించారని, వారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పాట్ హోల్ ఫ్రీ క్యాంపెయిన్ జరుగుతోందని తెలిపారు. పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్అండ్‌బి రోడ్లు, మున్సిపల్ రోడ్లు, జాతీయ రహదారులకు సంబంధించి ఎక్కడెక్కడ గుంతలు పడి దెబ్బతిన్నాయో గుర్తించి రానున్న రెండు నెలల్లో ఒక మిషన్ మోడ్‌లో ఆ గుంతలకు మరమ్మతులు చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ మద్దులూరు గ్రామంలో దెబ్బతిన్న రోడ్డును 20 లక్షల రూపాయలతో మరమ్మతు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. చీమకుర్తి దగ్గర దెబ్బతిన్న రహదారిని కూడా కోటి పది లక్షల రూపాయలతో రోడ్డు మరమ్మతు పనులను రానున్న పది రోజుల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఈ దేవానందం ఆర్డిఒ లక్ష్మి ప్రసన్న తహశీల్దార్ ఆదిలక్ష్మి గ్రామ సర్పంచ్ శైలజ, ఈఈ గోపినాయక్, ఎంపీడీవో సురేష్ బాబు, పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని కొనగానివారి పాలెం గ్రామంలో శనివారం జరిగిన చుండూరి సుబ్బారావు పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పాల్గొని చుండూరి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు నాదెండ్ల ఆంజనేయులు, చుండూరి శ్రీనివాసరావు, నాదెండ్ల మల్లికార్జున, సాహితి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

మహారాజ శ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 301/2024
సంగతాల ప్రసాదు .....వాది
ఎదిరి
ఇపనగండ్ల రమణ ....ప్రతివాది
టు.
ప్రతివాది చిరునామా
ఇపనగండ్ల రమణ తండ్రి కాశయ్య,
మాగుటూరు గ్రామం, అర్ధవీడు మండలం,
ప్రకాశం జిల్లా.
పై నెంబరు దావాలో దావా మొత్తం, దావా ఖర్చులు, వడ్డీ వగైరాలు రాగోరి వాది, ప్రతివాది, పైన దావాను దాఖలు చేసియున్నాడు. సదరు విషయమై ప్రతివాదికి ఎమైనా ఆక్షేపనలు ఉండిన యడల 21-11-2024వతేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టువారి ఎదుట హాజరై నీ ఆక్షేపనలు తెలుపుకొనవలెను. లేని యెడల నీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మాణించబడునని నీకు తెలియజేయడమైనది.
// కోర్టు వారి అనుమతిన //
గిద్దలూరు,
తేది: 01-11-2024 ఇట్లు
శ్రీ ఉదయగిరి మల్లిఖార్జునరావు,
వాది పరం అద్వకేటు.

మహారాజ శ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 293/2024
వల్లంశెట్టి విజయ భాస్కర్ .... వాది
ఎదిరి
కొల్లి మల్లిఖార్జునరావు ....ప్రతివాది
టు.
ప్రతివాది చిరునామా
కొల్లి మల్లిఖార్జునరావు,
తండ్రి సుబ్రమణ్యం,
C/o ఆకుల మురళి,
సాయిబాబగుడి దగ్గర,
కంభం గ్రామం మరియు మండలం,
ప్రకాశం జిల్లా.
పై నెంబరు దావాలో దావా మొత్తం, దావా ఖర్చులు, వడ్డీ వగైరాలు రాగోరి వాది, ప్రతివాది, పైన దావాను దాఖలు చేసియున్నాడు. సదరు విషయమై ప్రతివాదికి ఎమైనా ఆక్షేపనలు ఉండిన యడల 28-11-2024వతేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టువారి ఎదుట హాజరై నీఆక్షేపనలు తెలుపుకొనవలెను. లేని యెడల నీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మాణించబడునని నీకు తెలియజేయడమైనది.
// కోర్టు వారి అనుమతిన //
గిద్దలూరు,
తేది: 01-11-2024 ఇట్లు
శ్రీ ఉదయగిరి మల్లిఖార్జునరావు,
వాది పరం అద్వకేటు.

మహారాజశ్రీ ఫ్యామిలీ కోర్టు మరియు ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, ఒంగోలు
FDP 1/2024 ఇన్
IA 506/2024 ఇన్
OS 234/2013
పాలపర్తి శ్యామల అండ్ అదర్స్ ...పిటిషనర్స్
వర్సెస్
పాటిబండ్ల విమలమ్మ అండ్ అదర్స్ ..రెస్పాండెంట్స్
To
R7) పోలినేని సుభాషిని,W/o పోలినేని మందయ్య, R/o గాంధీ నగర్, 9వ లైను రాజీవ్ నగర్, చీమకుర్తి గ్రామం మరియు మండలం,ప్రకాశం జిల్లా,
R9) యాదాల సుబ్బమ్మ, W/o యాదాల బ్రహ్మయ్య, సర్వేరెడ్డి పాలెం గ్రామం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా,
పై నెంబర్ గల దావాలో ఏడు మరియు తొమ్మిది రెస్పాండెంట్లు అయిన మీకు పిటిషనర్స్ ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటనకు ఆర్డర్ వేసి ఉన్నారు తేది 20-11-2024న ఉదయం 10.30 నిమిషాలకి మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలపగలరు లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడును
// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్, ఒంగోలు

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో, ఒంగోలు
ఎ.యస్.నం.9/2023
మధ్యలో
జాగర్లమూడి పేరయ్య మరియు ఇతరులు
...అప్పిలెంట్లు
వర్సెస్
పేర్ల మోహనరావు మరియు ఇతరులు..రెస్పాండెంట్లు
To
R43) బండారు పద్మావతి
D/o పెద్ద కోటయ్య , వయస్సు 55 సం
R/o బండారు వారి విధి , ఒంగోలు ప్రకాశం జిల్లా.
పై నంబరు అప్పీలులో మీ హాజరు నిమిత్తం అనేక పర్యాయములు గౌరవనీయులైన పై కోర్టువారు, కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసును పంపిననూ, మీకు జారీకానందున ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కోర్టువారు తేది 14-10-2024న మీకు నోటీసును ఆర్డరు చేసియున్నారు. కావున తేది : 12-11-2024నకు వాయిదా రోజున మీరు స్వయముగా గానీ, లేదా అడ్వొకేట్ ద్వారా గానీ ఉదయం గం. 10-30 ని.లకు గౌరవనీయులైన పై కోర్టువారి ఎదుట హాజరై పై నెంబరు అప్పిలు లో మీ అక్షేపణలు తెలుపగలరు. లేని యెడల గౌరవనీయులైన పై కోర్టువారు మీ పరోక్షమున పై అప్పీలు ను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
సి.వి.రామక్రిష్ణారావు,
అడ్వొకేట్, ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 600/2022
M/s. Canara Bank, Kanumalla Branch,
(Erstwhile Syndicate Bank,
Kanumalla Branch), Rep.by its
Branch Manager - Plaintiff
Vs
Kommisetty Sowmya
Prop.M/s. **Viharika Garments,**
Mulaguntapadu (V) - Defendant
To,
Kommisetty Sowmya,
D/o **Kommisetty Ranga Rao,**
Business,
Prop. M/s. Viharika Garments,
Door No.1-157, Mulaguntapadu Village,
Singarayakonda Mandal,
Prakasam District, A.P.,
Phone Nos: 9642899990 & 6303724359.
పై నంబరున వాది మీ మీద దావా పరిహార ములకు డిక్రీ కోరుచూ దావా దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం **తే15-11-2024ది** కి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 15-11-2024
కందుకూరు.
వై. సాంబశివరావు
వాది తరపు అడ్వకేట్
కందుకూరు.

వివాదాస్పద స్థలం పరిశీలన

ప్రజాశక్తి -మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణ పరిధిలోని కొండేపల్లి రోడ్డులో గల వివాదాస్పద స్థలాన్ని అధికారులు పరిశీలించారు. సర్వే నెం.343ఎ లో 224 అడుగులు స్థలం వివాదాస్పదమై, పట్టణంలో వివిధ రకాల పుకార్లు వ్యాపించాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సుబ్బారావు, మార్కాపురం పురపాలక సంఘం కమిషనర్ డివిఎస్ నారాయణ రావు, పట్టణ ఎస్ఐ సైదా బాబు శనివారం సాయంత్రం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ వివాదానికి కారణమైన మార్కాపురం పురపాలక సంఘానికి చెందిన ఖాళీ స్థలాన్ని సందర్శించి అక్కడ ఉన్న హిందూ, ముస్లిం మత పెద్దలతో మాట్లాడామన్నారు. ఆ స్థలములో ఏ విధమైన ప్రార్థనా మందిరాలు, ఇతర కట్టకూడదని, ఆ స్థలముతో ఎవరికీ ఎలాంటి సంబంధం లేదని తీర్మానించారు. ఆ స్థలం

మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

కేవలం మార్కాపురం పురపాలక సంఘం ఆధీనంలో ఉందన్నారు. దీనికి సంబంధించి ఎలాంటి పుకార్లను, వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా కానీ పని కట్టుకొని తప్పుడు పుకార్లను సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అక్రమ తొలగింపులు ఆపాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆవులయ్య

ప్రజాశక్తి -రాచర్ల

అక్రమ తొలగింపులు ఆపాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య కోరారు. రాచర్ల మండలం పాలకవీడు ఎంపిపి పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు డి.భారతిని ఉద్యోగం నుండి తొలగించవద్దంటూ శనివారం రాచర్ల మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బాధితురాలితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవులయ్య, రాచర్ల మండల కార్యదర్శి డి.తామస్‌లు మాట్లాడుతూ ఎస్ఎంసి కమిటీ సమావేశం జరపకుండా సమావేశం జరిపినట్టుగా స్థానిక రాజకీయ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేసి భారతిని బలవంతంగా తొలగించాలంటూ సంతకాలు చేపించారన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ రెడ్డి ముఖ్య పాత్ర పోషించినట్లు వారు ఆరోపించారు. ఎస్ఎంసి కమిటీ సమావేశం రాచర్ల మండలం విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించాలని సిఐటియు నాయకులు ఎంఈఓకు విజ్ఞప్తి చేశారు.

పుస్తకాలు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు

బ్రెయిలీ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రీతమ్ అమర్త్య వంకాయలపాటి పుట్టినరోజు సందర్భంగా ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో ఒంగోలు కర్నూల్ రోడ్‌లో రావి అంజయ్య రోడ్డులో గుడ్ న్యూస్ మినిస్ట్రీ అంధుల పాఠశాలలో బియ్యం, నిత్యావసర వస్తువులు, అంధులకు బ్రెయిలీ బుక్స్ అందజేశారు. ఒంగోలు హౌసింగ్ బోర్డులోని బొమ్మరిల్లు అనాథ పిల్లల ఆశ్రమంలో భోజనం, వసతి ఏర్పాటుతో పాటు పిల్లలకు నోట్ బుక్స్, పండ్లు, కాయలు పంపిణీ చేశారు. ప్రీతమ్ పుట్టిన రోజును చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి.. వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మారెళ్ల రాజేశ్వరి, వంకాయలపాటి సత్యవతి, శ్రీదేవి, గుడ్ న్యూస్ మినిస్ట్రీ నిర్వాహకులు స్వర్ణ మోహన్‌రావు, బొమ్మరిల్లు నిర్వాహకులు ఖాసీం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో విజయం సాధించాలి

విద్యార్థులకు సిడిసి డీన్ సోమశేఖర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో విజయం సాధించాలని సిడిసి డీన్ ప్రొఫెసర్ సోమశేఖర, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిడి డాక్టర్ ఐ. దేవీ వరప్రసాద్ ఆకాంక్షించారు. యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో ఈ నెల 6 నుంచి 9 వరకు ఫెన్సింగ్ పోటీలు, అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఈ నెల 6 నుంచి 9 వరకు జరిగే తైక్వాండో పోటీలలో ఏకెయు క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీన్ ప్రొఫెసర్ సోమ శేఖర మాట్లాడుతూ గెలుపు, ఓటములు సహజమని, సమిష్టి కృషితో ప్రతి క్రీడాకారుడు ఆటలోని నైపుణ్యాన్ని ప్రదర్శించి లక్ష్యాన్ని చేరుకోవచ్చని సూచించారు. జమ్మూలోని యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో పాల్గొనే ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఫెన్సింగ్ జట్టులో నవీన్ కుమార్ (మెన్), విజయ లక్ష్మి (ఉమెన్) స్థానం సంపాదించారు. అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే తైక్వాండో పోటీలకు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ తరుపున రంజిత్, భాస్కర్ తదితరులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పాల్గొంటున్నారు. ఫెన్సింగ్ పోటీలలో పాల్గొనే జట్టుకు అడపాల వెంకటేశ్వర్లు, తైక్వాండో పోటీలలో పాల్గొనే జట్టుకు రాజేష్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నారు. అంతర యూనివర్సిటీ టోర్నమెంట్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు సిడిసి డీన్ ప్రొఫెసర్ సోమ శేఖర, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిడి డాక్టర్ ఐ.దేవీ వర ప్రసాద్ క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు, ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.సాయి సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మంగలకుంట సర్పంచి మృతి

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని మంగలకుంట గ్రామ సర్పంచ్ పిన్నిక శారద శనివారం మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా రోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. రేపు సర్పంచి స్వగ్రామమైన మంగళకుంటకు అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని తీసుకురానున్నట్లు సమాచారం.

పిన్నిక శారద (ఫైల్)

కేజీబీవీలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో శనివారం చింతల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యశ్విక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-తర్లుపాడు

గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తర్లుపాడు, మార్కాపురం రైల్వే స్టేషన్ల మధ్య శనివారం జరిగింది. తర్లుపాడు రైల్వే స్టేషన్ మాస్టర్ తెలిపిన వివరాల మేరకు.. తర్లుపాడు, మార్కాపురం రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం గుర్తించి ఫిర్యాదు చేయగా ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ టి.ఖలీల్ అహమద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తెల్లని చొక్కాపై నలుపు రంగు నిలువు, అడ్డం గీతలు కలిగిన ఫుల్ షర్ట్, ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎత్తు సుమారు ఐదున్నర అడుగులు, చామన చాయ రంగు కలిగి ఉన్నట్లు ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు నంద్యాల సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.అబ్దుల్ జలీల్ 9440627653 కు కానీ, కర్నూల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు యమ్.శ్రీనాథ్ రెడ్డి 9908889696 నెంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కొమరోలు

ఆదయ్య

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొమరోలు మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కొమ్ములపాటి ఆదయ్య (70) మతిస్థిమితం సరిగ్గా లేదు. అక్టోబర్ 28వ తేదీ నుంచి కనిపించకపో వడంతో కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో అన్వేషించారు. అయినా ఫలితం లేకపోవడంతో కొమరోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా ఆదయ్యను గుర్తిస్తే 9121102190, 6302569839 నంబర్లలో ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని బొమ్మలాపురం గ్రామంలో తిమపతమ్మ అనే మహిళ బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో శనివారం రాత్రి ఎస్ఐ పి.మహేష్ తన సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశారు. తిరుపతమ్మ అనే మహిళ వద్ద 21 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు సంగీతరావు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

రిటైర్డ్ ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త, బీఎస్పీ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు జగన్నాధం సంగీతరావు శనివారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. సంగీతరావు మాస్టర్‌గా ఉపాధ్యాయ రంగంలో విశేష సేవలందించారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా పలు అవార్డులు అందుకున్నారు. యుటిఎఫ్ మండల అధ్యక్షునిగా పనిచేశారు. పెన్షనర్స్ సంఘంలో పనిచేశారు. గతంలో బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మరి లక్ష్మీనారాయణ, నాయకులు ఉప్పుతోళ్ల నారాయణ, ఎన్.హరిప్రసాద్, బండి వెంకటేశ్వర్లు మాస్టారు, దోమల పుల్లయ్య, యుటిఎఫ్ నాయకులు తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సంగీతరావు (ఫైల్)

ఎస్‌సి ఉప కులాల అభివృద్ధికి వర్గీకరణే మార్గం

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

రాష్ట్ర విద్యార్థి యువజన జెఏసి అధ్యక్షుడు జగదీష్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి ఉప కులాలు అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ ఒక్కటే మార్గమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థి యువజన జెఏసి రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్ తెలిపారు. ఒంగోలు అంబేద్కర్ భవనంలో విద్యార్థి యువజన జాగృతి ఆధ్వర్యంలో మాల, మాదిగ విద్యార్థి యువజన ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి విద్యార్థి యువజన జాగృతి రాష్ట్ర కోఆర్డినేటర్ రెబ్బవరపు ప్రేమ్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు బత్తుల సుబ్రహ్మణ్యం అధ్యక్షత

మాట్లాడుతున్న రాయపాటి జగదీష్

వహించారు. ఈ సందర్భంగా రాయపాటి జగదీష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 59 ఉప కులాలకు 15 శాతం రిజర్వేషన్ పంచకొని 25 శాతం రిజర్వేషన్ పెంచుకుందామన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ముఖ్య మంత్రులు వర్గీకరణ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యువజన జాగృతి రాష్ట్ర కోఆర్డినేటర్ రెబ్బవరపు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్ పేరుతో కుల సంఘ నాయకులు మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ఈ సమావేశంలో యువజన జాగృతి అధ్యక్షుడు కొమ్ము రాజీవ్, పిల్లి మురళి, బత్తుల వెంకట్రావు బందారు శేషగిరి, గంధం బెంజిమెన్, కరుణాకర్, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

మద్యం సిండికేట్లతో పేదల జీవితం ఛిద్రం

సిపిఎం చీరాల ప్రాంతీయ మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి

సిపిఎం చీరాల ప్రాంతీయ మహాసభలో మాట్లాడుతున్న డి రమాదేవి

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్రంలో మద్యం సిండికేట్లు మద్యం ఏరులై పారిస్తున్నారని, దీంతో పేదల జీవితాలు ఛిద్రమవుతాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి రమాదేవి పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో శనివారం ప్రారంభమైన సిపిఎం చీరాల ప్రాంతీయ మహాసభలో ఆమె మాట్లాడారు. మద్యం మత్తులో అనేక చోట్ల మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. మద్యం నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విచ్చలవిడి మద్యం విక్రయాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు ప్రశ్నించాలని చెప్పారు. పెట్రోల్, డిజల్ ధరలు పెరుగుతుంటే వాటిపై ప్రభుత్వం మాట్లాడటం లేదని అన్నారు. ప్రజల ఓటు హక్కును కాజేసెందుకే మోడీ జమిలి ఎన్నికలు తీసుకు వచ్చి పెత్తనం చేయాలని చూస్తుందని అన్నారు. మోడీ నియంతృత్వ పోకడకు టిడిపి, జనసేన కూడ మద్దతునిస్తున్నాయని ఆరోపించారు. ఇదే జరిగితే ఉద్యోగ, జీవిత, భద్రత లేకుండాపోతుందని అన్నారు. కార్మిక రక్షణ చట్టాలను యజమానులకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్చడం వల్ల కార్మికులు తీవ్ర నిర్బంధం ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పెరిగిన ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యలు అధిగమించాలని, మహిళలపై పెరుగుతున్న అత్యా చారాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వాన్‌పిక్ పేరుతో సేకరించిన 20వేల ఎకరాల భూమిలో పరిశ్రమలు పెట్టకుండా కాలయాపన చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. బాపట్ల జిల్లాకు పరిశ్రమలు తీసుకురావాలని అన్నారు. ఆయకట్టు స్థిరీకరించి సాగునీరు అందించాలని కోరారు. జిల్లాలో పిజి సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అధికార, ప్రతిపక్ష నేతల వ్యక్తిగత విషయాలను చర్చకు పెట్టి ప్రజా సమస్యలు, అభివృద్ధి, ఉపాధి కల్పన చర్చకు రాకుండా చేస్తున్నారని అన్నారు. చీరాల పట్టణంలో ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని సిపిఎం చీరాల కార్యదర్శి ఎన్ బాబురావు కోరారు. చేనేత నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేసి చేనేత వృత్తిలో ఉపాధి కల్పించాలని కోరారు. కష్ట జీవులుకు అండ ఎర్ర జెండా ఉంటుందని సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్ పేర్కొన్నారు. ప్రశ్నించే ఉద్యమ నేతలను ప్రభుత్వాలు అరెస్టు చేసి జైళ్లకు పంపి భయభ్రాంతులకు గురి చేస్తుందని అన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు పి కిరణ్, ఎం సత్యమూర్తి, ఎం అయ్యపరెడ్డి గీతాలాపన చేశారు. సిపిఎం నాయకులు ఎం వసంతరావు, ఎల్ జయరాజు, పి కొండయ్య, డి నారపరెడ్డి, బి హరిప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి - కొల్లూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహా సభ స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులైన ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వినయ్, ఎ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి ఎం వెంకటేష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బి వినోద్ బాబు, సీనియర్లు కెవి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

రోడ్లు అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి

ప్రజాశక్తి - రేపల్లె

ఎపిలో గుంతల రహిత రోడ్లను ప్రభుత్వం నిర్మిస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ అన్నారు. గుంతలు రహిత రోడ్ల పనులు ప్రారంభించారు. రేపల్లె, తుమ్మల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన నల్లూరుపాలెం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గుంతల రహదారుల్లో ప్రయాణాలు సాగించలేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అప్పటి ప్రభుత్వం రోడ్లపై గుంతలు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు 'మిషన్ పాట్ హెూల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' ద్వారా రాష్ట్రంలో రహదారులు గుంతలు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో 8వేల కిలోమీటర్ల రోడ్డులో రూ.290కోట్ల వ్యయంతో మరమ్మత్తు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 2వ దశలో 8వేల కిలోమీటర్ల రోడ్లు రూ.350కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, వడ్డీ లక్ష్మోజి, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, పంచాయతీరాజ్ అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

70 ఏళ్లు దాటిన వారికి 'జన ఆరోగ్య యోజన'

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ఎబిపి ఎంజెఎవై పథకాన్ని 70ఏళ్లు దాటిన వారికి కూడా వర్తింపజేస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. 70ఏళ్లు దాటిన వారు ఈ పథకం ద్వారా వైద్య చికిత్స పొందవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరైనా రూ.5లక్షల వరకు వైద్య సేవలు పొందినప్పటికీ మరొక రూ.5లక్షలు చికిత్స కొరకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. వివరాల నమోదు కోసం తమ పరిధిలోని ఎఎన్ఎంను సంప్రదించాలని తెలిపారు. ఆధార్ కార్డులో వయసు ప్రామాణికంగా ఈ పథకం వర్తింప చేస్తారని పేర్కొన్నారు. ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకున్న వాళ్లు కూడా వర్తిస్తుందని తెలిపారు.

ముగిసిన చిప్ డిజైనింగ్ వర్క్ షాప్

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో చిప్ డిజైనింగ్‌పై నిర్వహించిన వర్క్ షాపు విజయవంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో బిటెక్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ సహకారంతో చిప్ డిజైనింగ్‌పై వర్క్ షాపు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె జగదీస్ బాబు తెలిపారు. ఆధునిక ఎలక్ట్రానిక్స్‌లో చిప్ డిజైనింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని పేర్కొన్నారు. వివిధ పనులను, వేగతంగా, ఖచ్చితంగా నిర్వహించటానికి ఎలక్ట్రానిక్స్ పరికరాలు పనిచేయించటానికి సరైన చిప్ డిజైనింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని తెలిపారు. చిప్ డిజైనింగ్‌లోని ప్రాథమింక అంశాలు, చిప్ తయారిలో వివిధ దశలు, చిప్ తయారు చేసేటపుడు ఏయే అంశాలను దృష్టిలో ఉంచుకొవాలనే విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఇసిఇ విభాగాధిపతి డి రాజేంద్రప్రసాద్ తెలిపారు. లైవ్ వైర్, పిసిబి విజార్డ్ సాఫ్ట్వేర్‌పై ప్రాక్టికల్స్ నిర్వహించి పరిశ్రమల్లో ఉపయోగించే చిప్స్‌ను తయారు చేయించినట్లు తెలిపారు. వర్కషాపులో ఎపిఎస్ఎస్‌డిసి నుండి ఎం ఉమా మహేశ్వరరావు విద్యార్థులకు చిప్ డిజైనింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌వి రాఘవస్వామి, ఎస్ సాయి సందీప్, ఎస్ రవీంద్ర, జి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

అర్జులు సేకరిస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

గ్రామసభలో రైతుల వినతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోన గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గత ప్రభుత్వ పాలనలో గ్రామంలో భూములు రీ సర్వే చేశారు. సర్వే కారణంగా రైతులకు సమస్యలు ఉంటే పరిష్కారానికి అర్జుల రూపంలో దరఖాస్తు చేసుకునేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. దరకాస్తు చేసుకుంటే పరిష్కరి స్తామని తహాశీల్దారు ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ గ్రామ సభలో రైతుల నుండి 10 దరఖాస్తులు అందాయని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. విఆర్‌ఒ అంబటి ప్రసాద్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం

రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభిస్తున్న ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని మైలవరం ప్రధాన రహదారి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.50లక్షల నిధులతో పనులు శనివారం ప్రారంభించారు. పది రోజుల క్రితం శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఈ పనికి శంకుస్థాపన చేయగా నేడు సిసి రహదారి నిర్మాణాన్ని పూర్తిచేసే విధంగా నాయకులు దగ్గరుండి పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి కంప తొలగించి గుంటలు ఏర్పడిన రహదారిని చదును చేస్తున్నారు. అనంతరం రహదారికి ఇరువైపుల కివాల్ నిర్మాణం చేపట్టి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాదు, డోలా శివకుమార్, వామనపల్లి కోటేశ్వరరావు, జగ్గారపు పాపారావు పాల్గొన్నారు.

వేమూరు : అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామంలో రూ.20లక్షల నిధులతో రోడ్లు మరమ్మత్తు పనులను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు శనివారం ప్రారంభించారు. 4.2కిలోమీటర్ల గుంతల రోడ్లు బాగు చేసేందుకు ప్రభుత్వ శత శుద్ధితో ఉందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఐదేళ్లు రోడ్లు వేసిన దాఖలాలు లేవని అన్నారు. రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయని అగ్రహారం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు తప్పితే గత ఐదేళ్లలో అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని అన్నారు. కనీసం రోడ్ల గుంతలు పూడ్చలేనటువంటి దిక్కుమాలిన పరిస్థితికి తీసుకువచ్చారని ఆరోపించారు. కనీసం 10కిలోమీటర్లు కూడా ప్రయాణం చేయలేని దుస్థితికి ఎపి చేరిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు గుంతలు పూడ్చి రోడ్లు మరమ్మతులు చేయడానికి రూ.800 కోట్ల నిధులు విడుదల చేశారన్నారని చెప్పారు. 2025 జనవరి నాటికి గుంతలు లేని రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని చంద్రబాబు శ్రీకారం చుట్టారని, రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకి తీసుకువెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఇంకొల్లు, సంతరావూరు రహదారి గుంతలమయంగా మారిపోయింది. అధ్వానంగా మారిన రహదారి మరమ్మతులకు రూ.15లక్షల నిధులు మంజూరైనట్లు ఆర్ అండ్ బి జెఇ శ్రీకాంత్ తెలిపారు. గుంతలు పూడ్చే పనులు లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, చిన్నగంజాం తెలుగుదేశం అధ్యక్షులు పొద వీరయ్య, యార్లగడ్డ లక్ష్మి, మాజీ జెడ్పిటిసి గుంజి వెంకటరావు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు మార్కు, కర్రీ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి డిఈ నళిని పాల్గొన్నారు.

చిన్నగంజాం : గుంతులు లేని రోడ్ల కార్యక్రమంలో భాగంగా రోడ్ల మరమ్మత్తు పనులను శనివారం ప్రారంభించారు. తెలుగుదేశం మండల అధ్యక్షులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావు మాట్లాడుతూ గుంతలు లేని రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని సిమెంట్ రోడ్లు నిర్మాణమే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి యార్లగడ్డ లక్ష్మి, గుంజి వెంకటరావు, ఇంకొల్లు పట్టణ అధ్యక్షుడు మార్క్, నాయకులు దేవతోటి నాగరాజు వెంకటేశ్వర్లు, సురేష్ వెంకట్రావు, తూమటి శ్రీను, కర్రి శ్రీను, రాజేష్, సునీల్, వీరస్వామి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న టిడిపి అధ్యక్షులు వీరయ్యచౌదరి

డెంగీ నివారణకు బాధ్యతతో పనిచేయండి

ఎన్‌విబిడిసిపి కన్సల్టెంట్ కొండారెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో డెంగ్యూ, మలేరియా కేసుల నివారణకు బాధ్యతతో పనిచేయాలని నేషనల్ వెక్టర్ బార్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్(ఎన్‌విబిడిసిపి) రాష్ట్ర కన్సల్టెంట్ ఇ.కొండారెడ్డి ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా కన్సల్టెంట్ కొండారెడ్డి శుక్రవారం ఒంగోలు నగరంలోని గద్దలగుంట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ధారావారితోట సచివాలయాన్ని సందర్శించారు. ఇందిరాకాలనీ ఏరియా లో ఫ్రైడే డ్రైడే ప్రోగ్రాం లో పాల్గొన్నారు. రాజాపానగల్ రోడ్డులోని 9వ లైన్‌లో పర్యటించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు. శనివారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ల్యాబ్‌ను పరిశీలించారు. పాత రిమ్స్‌లోని జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర కన్సల్టెంట్ కొండారెడ్డి దోమల ద్వారా పుట్టే వ్యాధులపై వెక్టార్ బార్న్ డిసీజెస్‌పై తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. డెంగ్యూ, మలేరియా కేసులు నివారణకు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖతో సమన్వయం చేసుకొని ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు కలిసి పనిచేయాలని సూచించారు. డిఎంఒ వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో సెక్రటరీ లెవల్‌లో పెండింగ్ లేకుండా చూడాలని సబ్ యూనిట్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, సబ్ యూనిట్ అధికారులు, వెంకారెడ్డి, సాగర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కొండారెడ్డి

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి వెలుగులు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మొన్నటి వరకు జగన్ పాలన ఆంధ్రప్రదేశ్ విధ్వంసానికి చిరునామా కాగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివద్ధికి చిరునామాగా ముందుకెళ్తోందని టిడిపి నియో జకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఐదేళ్ల అప్పులు, అరాచకాలతో వార్తల్లో నిలిచిన రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమం గురించి మాత్రమే మాట్లాడుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన గుంతల రహిత కార్యక్రమంలో భాగంగా శనివారం పుల్లలచెరువు మండలం ఐటివరం, మానేపల్లి, పంచాయతీలలో గుంతల పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాదు, నాయకులు కాకర్ల కోటయ్య, శనగ నారాయణరెడ్డి, బోగోలు వెంకట సుబ్బారెడ్డి, మేడికొండ లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

లైసెన్సు షాపుల్లోనే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాల్లోని రైతులు లైసెన్సు కలిగిన అధీకృత డీలర్ల షాపులలో మాత్రమే ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని యర్రగొండపాలెం సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు కె.నీరజ తెలిపారు. ఈ నెల రెండున ప్రజాశక్తి దినపత్రికలో 'భయో' మోసం పేరిట కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన కె నీరజ శనివారం త్రిపురాంతకం మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపులను తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తాము ఎప్పటికప్పుడు సంబంధిత వ్యవసాయ శాఖాధికారులతో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు, బయో మందులకు సంబంధించి ప్రతి షాపులో జి-2 మరియు జి-3 ఫారంలను తనిఖీ చేసి అనుమతులు లేని బయోమందుల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నారని తెలిపారు. ఎవరైనా ఎరువులు, పురుగు మందుల డీలర్లు అనుమతులు లేని బయో మందులను అమ్మితే, విక్రయిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కస్తూరిబాలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండల కేంద్రమైన పుల్లలచెరువులోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్య విద్యను బోధించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎంజె ఇందిర ప్రసాద్, కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లి ప్రకాష వాని, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నదోర్నాలలో రెండు ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని చిన్న దోర్నాలలో దొంగలు హల్చల్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలోని రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పసుపుల కోటేశ్వరరావు ఇంట్లో ఒక ఉంగరం, మూడు జతల మాటీలు, రెండు వెండి ఉంగరాలు చోరీ చేశారు. అలాగే పొదిలి అనంతరాయుడు ఇంట్లో ఒక ఉంగరం, ఒక జత కమ్మలు అపహరించుకుపోయారు. శనివారం ఉదయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజా పోరు'ను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ప్రజల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుంచి 15 వరకు చేపట్టే ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. శనివారం సిపిఎం మండల కమిటీ సమావేశం ఎస్.తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువులు, వంట నూనె ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఉద్యోగాలు వచ్చే జాడ కనిపించకపోవడంతో యువత నిరుత్సాహానికి గురవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. ఆచూకీ కనిపించని ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదన్నారు. అవినీతి విచ్చలవిడిగా సాగుతున్నదని, ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని అన్నారు. మద్యాన్ని నియంత్రంచాల్సింది పోయి ఏరులై పారించాలనుకోవడం ప్రజల ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని కొల్లగొట్టడమే అవుతుందన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో 20 వేల కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలైన సూపర్ సిక్స్ పథకాలతో పాటు చంద్రబాబు నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం చేసిన వాగ్దానాలాన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధిక ధరలను తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, దళితులు, గిరిజనులపై దాడులను అరికట్టాలని, వెలిగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, జమిలీ ఎన్నికలు ఆపాలని కోరుతూ ఈ నెల 15న జిల్లా కలెక్టరేట్, మండల కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, నాయకులు ఎం రత్నారెడ్డి, బి జేసురత్నం జి ఏసుదాసు, ఊసా రాజ్యలక్ష్మి, పామూరు పార్టీ మండల కార్యదర్శి కే మాల్యాద్రి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

పరిశ్రమలు ఎదగాలి..కాలుష్యం తగ్గాలి

ఏపీటిసిబి చైర్మన్ కృష్ణయ్య

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి ప్రాంతంలో పరిశ్రమలు బాగా అభివృద్ధి చెంది ఉపాధి పెరగాల్సి ఉందని, దానికి అనుగుణంగా కాలుష్యం నియంత్రణ కావాల్సి ఉందని రాష్ట్ర కాలుష్య నివారణ బోర్డు చైర్మన్ టి.కృష్ణయ్య పేర్కొన్నారు. ఆయన శనివారం స్థానిక ఎమ్మెల్యే బిఎన్.విజయ కుమార్‌తో కలిసి చీమకుర్తి ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమ, పాలు సింగ్ యూనిట్లు, కంకర మిల్లులు, రోడ్డు కాలుష్యంపై క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ఆయన శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా పలు గ్రానైట్ గనులను, కంకర మిల్లులను, పాలిషింగ్ యూనిట్లను పరిశీలించారు. అనంతరం రామతీర్థం లోని వీటిసి సెంటర్లో ఏర్పాటుచేసిన గ్రానైట్ యజమానులు, పాలిషింగ్ యూనిట్ యజమానుల, కంకర మిల్లు యజమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే కాలంలో పరిశ్రమ మరింత అభివద్ధి చెంది ఉపాధి విస్తతం కావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ 20 లక్షల ఉద్యోగాల కల్పనకు పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభివద్ధితో పాటు ఆయా ప్రాంతాల్లో కాలుష్యం అదుపులో ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. కలెక్టర్, గ్రానైట్ యజమానులు, పాలు సింగ్ యూనిట్‌ల యజమానులతో మాట్లాడి చీమకుర్తి ప్రాంతంలో కాలుష్యం నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనికి అందరి సహకారం కావాలన్నారు. సమస్యలు పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే బిఎన్. విజయ్‌కుమార్ సహకారంతో ఈ ప్రాంత అభివద్ధికి కషి చేస్తానన్నారు. సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ వ్యాపారాలు బాగా అభివద్ధి చెందాలని, గ్రానైట్ గనుల ప్రాంతంలో అభివద్ధికి తన సహకారం పూర్తిగా ఉంటుందని పేర్కొన్నారు. చీమకుర్తి నుంచి మరి చెట్ల పాలెం వరకు రోడ్డు విస్తరణ చేయటం వల్ల ట్రాఫిక్కు తగ్గే అవకాశం ఉందని, ప్రమాదాల నివారణకు అవకాశం ఉందని, విస్తరణ పనులకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రాఘవరెడ్డి, మైన్స్ డిడి రాజశేఖర్, మైన్స్ విజిలెన్స్ ఏడి రామచంద్ర, గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజీమ్, ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాట్రగడ్డ రమణయ్య, అసోసియేషన్ నాయకులు చంద్రారెడ్డి, ఆర్ పి రవి, పలువురు గ్రానైట్, కంకర మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణయ్య

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే 'పల్లె నిద్ర'

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గ్రామాలలోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వమిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ అధికారులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ అధికారులు వారి పరిధిలోని గ్రామాలలో రాత్రి బస చేసి గ్రామంలోని ప్రజలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. గ్రామాలలో స్థానికంగా వున్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాల గురించి, సైబర్ నేరాలు జరుగుతున్న తీరును గురించి ప్రజలకు వివరించి వాటి బారిన పడకుండా ప్రజలు ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరుకూరు గ్రామంలో "పల్లెనిద్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. స్థానికంగా ఉన్న సమస్యల గురించి, వివాదాలు, అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారం అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖను ప్రజలకు చేరువ చేసేందుకు జిల్లా ఎస్పీ తుషార్‌డూడి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాలలోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా మీ మధ్యకు రావడం జరిగిందన్నారు. స్థానికంగా, వ్యక్తిగతంగా మీకు ఉన్న సమస్యలను తమ దష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహజంగా గ్రామాలలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వారిని సులువుగా గుర్తించవచ్చునన్నారు. అటువంటి వారి ప్రవర్తనలో ఏదైనా అనుమానం కలిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మార్టూరు రూరల్ సిఐ శ్రీనివాసరావు, పర్చూరు ఎస్సై మాల్యాద్రి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని ఈపురుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కీర్తివారిపాలెం గ్రామంలో ఏఆర్ డిఎస్పి చంద్రమోహన్ నిర్వహించారు. అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఈపురుపాలెం ఎస్సై శివకుమార్ పాల్గొన్నారు.

ఊరూరా మత్తెక్కిస్తున్న బెల్ట్ షాపులు

- పల్లెల్లో 24గంటలు మద్యం విక్రయాలు
- క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.50వరకు బాదుడు
- విచ్చలవిడి దందాను పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- 'మామూళ్ల'తో మౌనంగా ఉంటున్న అధికారులు

ప్రజాశక్తి - రేపల్లె

పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది. లైసెన్స్ దుకాణాలకు అనుబంధంగా బెల్టు షాపులకు అధికారులే గేట్లు ఎత్తేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ప్రభుత్వం మద్యం దుకాణాల లైసెన్సు ఫీజులు భారీగా పెంచింది. దీంతో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు అదనపు ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అవకాశం ఉన్న ప్రతి చోట బెల్టు షాపులకు తెరతీశారు. దుకాణాలు లేని చోట ప్రధాన కూడళ్లకు సమీపంలో, గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేయించారు. మద్యం దుకాణం దక్కించుకున్న వారే బెల్టు షాపు ఇవ్వడంతో ఇక బెల్టు షాపు నిర్వాహకులు ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. బహిరంగంగానే రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యంతో ప్రజారోగ్యాన్ని గుల్ల చేశారు. ఇప్పుడు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఇచ్చిన హామీ మేరకు కొత్తగా మద్యం దుకాణాలను కేటాయించారు. దీంతో మద్యం దుకాణాలు దక్కించుకున్న ప్రవేటు వ్యక్తులు వ్యాపారాన్ని విస్తరించేందుకు కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. దుకాణాలు లేని శివారు ప్రాంతాలను సైతం మద్యం విక్రయాలు సాగించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. నివాస గృహాలు, కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో 24గంటలు అందుబాటులో ఉంటోంది. ఎప్పుడంటే అప్పుడు, ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ వైన్ షాపుల మాదిరి ఇళ్లలోనే లభ్యం అవుతోంది. కిలోమీటర్ల మేర దూరంలోని వైన్ షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఐదో, పదో ఎక్కువిస్తే ఇంటి పక్కనే మద్యం దొరుకుతోంది.

మౌనం వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్లకు అలవాటు పడుతున్నారు. బెల్టు షాపుల సమాచారం తెలిసినా కూడా మౌనంగా తమకేమీ తెలియనట్లు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తీరంలో బెల్ట్ షాపులు జోరుగా సాగుతున్నాయి. దీంతో వయసుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిస అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. యువత మద్యానికి బానిసై నేరస్తులుగా మారి కేసుల్లో చిక్కుకుంటున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

లైసెన్స్ వైన్ షాపులకు అనుబంధంగా

మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 20నుండి 30చొప్పున బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. తమ టార్గెట్లు చేరుకొనేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్ షాపుల నిర్వాహకులను అధికారులే ప్రోత్సహిస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైన్‌షాపుల నుంచి ఎంఆర్‌పి ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వా హకులు అవసరాన్ని, సమయాన్నిబట్టి ఒక్కో క్వార్టర్ బాటిల్ పై రూ.20 నుంచి రూ.50వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

సంసారంలో మద్యం చిచ్చు

గ్రామాల్లో బెల్ట్ షాపులు తొలగించాలంటూ మహిళలు బహిరంగంగానే నిరసన వ్యక్తం చేస్తున్నారు. కానీ నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలు పని చేసి వచ్చి పట్టణానికి వెళ్లి మద్యం తాగడం ఎందుకని గతంలో ఇండ్లలో ఉండేవారు. కానీ గ్రామాల్లో బెల్ట్ షాపుల వలన కూలి పనితో వచ్చిన డబ్బులో సగం మద్యానికి ఖర్చుపెడుతున్నారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం

బెల్ట్ షాపులు నియంత్రించేందుకు ఎక్సైజ్ శాఖ అన్ని విధాల కృషి చేస్తోందని ఎక్సైజ్ సిఐ ఆర్ దివాకర్ అన్నారు. అనుమతులు లేకుండా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని సమాచారం ఇస్తే వారి పేరును గోప్యంగా ఉంచి బెల్ట్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు.

అంతా... మా ఇష్టం..

పోలీస్ స్టేషన్ అయితే మాకేంటి?

ప్రజాశక్తి - చీరాల

పోలీస్ స్టేషన్, బస్ స్టాండ్, మార్కెట్ సెంటర్ రోడ్డు ఏదైనా వాహనాలు నిలిపేవాళ్లకు కనీస విజత ఉండటం లేదు. మా ఇష్టం అన్న రీతిగా కొందరు ద్విచక్రన వాహనదారులు ఇష్టా రీతిలో రోడ్లకు అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో రోడ్లపై తిరగాలంటే ఇబ్బందిగా మారింది. దుకాణాల ఎదుటైతే అడ్డదిడ్డంగా వాహనాలు పార్క్ చేస్తుండటంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. సాధారణ ప్రజలకే కాదు ఏకాంగా పోలీసు స్టేషన్ ప్రధాన ద్వారానికి ఎదురుగా బైకులు పార్కు చేశారు. పోలీసు వాహనాలు స్టేషన్‌లోకి వెళ్లే ప్రధాన దారిలో అడ్డంగా ద్విచక్రవాహనాలు ఆపడం చూసిన ప్రజలు ఔరా..! అంటూ ముక్కున వేలేసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు తీరును విమర్శిస్తున్నారు. ఇదేనా ట్రాఫిక్ నియంత్రణ అంటూ చెవులు కొరుకున్నారు.

పోలీస్ స్టేషన్ ప్రధాన ద్వారానికి ఎదురుగా నిలిపిన బైకులు

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆ వ్యాధి మానవులకు సోకటం ద్వారా మానవ ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలు చూపిస్తుందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అన్నారు. అంటించుకునే వ్యాధని అన్నారు. 2030 నాటికి రాష్ట్రంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేయాలని కోరారు. పట్టణంలోని సింగరకొండ రోడ్డులోని ఏపి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ జిల్లా సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా ఐఇసి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఈ దుర్గా గాయత్రి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు సామాజిక స్పృహ కలిగి ఉండాలని చెప్పారు. సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులు పట్ల వివక్షత చూపించకూడదని అన్నారు. వారి పట్ల ప్రేమ, ఆప్యాయత చూపించాలని అన్నారు. పచ్చబొట్లు, అపరిశుభ్రత నీడిల్స్, సరైన రక్త పరీక్షలు నిర్వహించకుండా ఆ రక్త నిల్వలను ఎదుటివారికి ఎక్కించినప్పుడు, విచ్చలవిడి శృంగారంలో పాల్గొన్నప్పుడు హెచ్ఐవి, ఎయిడ్స్ సంక్రమించేందుకు అవకాశం ఉందని తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ టోల్ ఫ్రీ ఎయిడ్స్ 1097 ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్టూరు, అద్దంకి, కొరిసపాడు, నాగులప్పలపాడు అవుట్రిచ్ వర్కర్స్ కె దుర్గా, ఎం మల్లేశ్వరి, కృష్ణవేణి, కరుణ శ్రావణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిఐ డైరెక్టర్ బివి సాగర్

చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేస్తున్న సిబ్బంది

చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు సిబ్బందిని పంపించి పెన్షన్ అందజేశారు. పక్షవాత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న భట్టిప్రోలు గ్రామానికి చెందిన మహిళకు రూ.15వేల పెన్షన్ అందించారు. కోనేటిపురం సచివాలయం పరిధిలోని పాలమూడి గ్రామానికి చెందిన రాజులపాటి నాంచారయ్య గుండె జబ్బుతో సివిఆర్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా ఆయనకు పెన్షన్‌ను డిజిటల్ అసిస్టెంట్ వైద్యశాలకు వెళ్లి అందజేసినట్లు ఎంపిడిఒ ఎస్‌వి రమణ తెలిపారు.

పంగులూరు : నవంబర్ నెల పెన్షన్లు 99 శాతం పంపిణీ జరిగిందని ఎంపిడిఒ కె స్వరూపరాణి శనివారం తెలిపారు. మండలంలోని 14సచివాలయాల పరిధిలో 7,890మంది పెన్షన్ దారులు ఉండగా అందులో ఒకటి, రెండు తేదీల్లో 7,784 మందికి పెన్షన్లు పంపిణీ చేశామని చెప్పారు. ఇంకా 106మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా వారిలో 32మంది చనిపోయారని 74 మందికి పెన్షన్లు పంపిణీ జరగాల్సి ఉందని తెలిపారు.

తవుడు దాణా పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ మిత్రుల సౌజన్యంతో హరిహర గోశాలకు 3బస్తాలు తవుడు దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, కొల్లిపర నాగయ్య, ఉరిటి శ్రీనివాసరావు, గుళ్ళపల్లి సుబ్రహ్మణ్యం, గోశాల నిర్వాహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న అంబటి గిరిధర్

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

కడప జిల్లా రాయచోటిలో గత నెల 28, 29 తేదీల్లో జరిగిన అండర్ 17 కబడ్డీ పోటీల్లో బాపట్ల విజిఆర్‌ఎం జూనియర్ కళాశాల విద్యార్థి మేడిబోయిన పవన్ కళ్యాణ్‌రెడ్డి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ అంబటి గిరిధర్ శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైన పవన్ కళ్యాణ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించాడని తెలిపారు. విద్యతోపాటు క్రీడలకు తమ కళాశాల ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు అర్హత సాధించిన పవన్ కళ్యాణ్‌ను కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు.

ఆటో తగిలి బాలుడు మృతి

ప్రజాశక్తి - బాపట్ల

మృతిచెందిన బాలుడు

పాఠశాల పిల్లలను తీసుకొని వెళ్లే ఆటో తగిలి 8 నెలల బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జమ్ములపాలెం గ్రామ ఆనంద్ నగర్లో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అప్పటి వరకు కళ్ళ ఎదుటే ఆడుకుంటున్న బాలుడు ఆటో తగిలి గాయపడి మృతి చెందడంతో బాలుని తల్లి, దండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను సైతం కంట తడిపెట్టించింది. 8నెలల ప్రకాష్ బాబు తల్లి, దండ్రుల బంధువైన మతిస్థిమితం లేని ఓ బాలిక బాలుడిని ఎత్తుకొని ఉండగా స్కూలు పిల్లలను తీసుకెళ్లేందుకు వచ్చిన ఆటో తగిలి సైడ్ కాలువలో పడుతూ బాలుడిని వదిలేసిందని పోలీసులు తెలిపారు. దీంతో ప్రమాదవశాత్తు బాలుడికి ఆటో తగిలి తలకు బలమైన గాయం కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ చూసుకోక పోవడం వల్లే ప్రమాదానికి గురై బాలుడు మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు మృతిచెందిన బాలుడు ప్రకాష్ బాబు తల్లిదండ్రులు మోచర్ల కృపశేఖర్, సౌమ్య సుసన్న ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బాలుడి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ట్రాక్టర్‌కు చెత్త నింపిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని భట్టిప్రోలు పంచాయితీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు కోరారు. గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో కార్మికులకు అండగా నేను సైతం అంటూ పారిశుధ్య పనుల్లో పాల్గొని కార్మికులకు భరోసా కల్పించారు. పంచాయతీ ఆదీనంలో రెండు ట్రాక్టర్లు ఉండగా వాటిలో ఒకటి మరమతులకు గురి కావడంతో దానిని మరమ్మత్తులు చేయించేందుకు తనకు పంపించడంతో ఒకే ట్రాక్టర్ ద్వారా చెత్త బయటకు తరలించేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో గ్రామంలో మార్కెట్ పరిసర ప్రాంతాల్లో చెత్త తరలించాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన చెత్త నిర్మూలన చేపట్టేందుకు తాను కూడా భాగస్వామ్యమైనట్లు తెలిపారు.

'పల్లెనిద్ర'లో పోలీసులు

ప్రజాశక్తి - పర్చూరు

ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు ఎస్పీ విఠలేశ్వర్, సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మాల్యాద్రితో కలిసి చెరుకూరులో నిద్రించారు. గ్రామంలో బసచేసి ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును ప్రజలకు వివరించారు. వాటి బారిన పడకుండ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. స్థానిక సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దొంగతనాలు జరగకుండ వ్యాపార సముదాయాలు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నేటి నుండి మోస్ట్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్ సర్వే

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం నుండి మోస్ట్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్ సర్వే జరుగుతుందని ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. బిసి(ఎ)లో కేటగిరీకి సంబంధించిన సంచారజాతి తెగలకు సంబంధించి బండ, దాసరి, దొమ్మర, జంగం, గంగిరెద్దుల, కాటికాపరి, గూడల, జోగి, పాముల తదితర జాతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను తెలుసుకునేందుకు, అవసరమైన చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలు అనుసరించి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లచే 3రోజులపాటు సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా విద్యార్థి మృతి

ప్రజాశక్తి - కొరిశపాడు

అనుమానస్పదంతో విద్యార్థి గుండ్లకమ్మ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు మండలంలోని కొరిశపాడు గ్రామానికి చెందిన దాట్ల శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీలోని 19వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు పెద్ద కుమారుడు పెట్రోల్ బంకులో పనిచేస్తుండగా, చిన్న కుమారుడు పట్టణంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న దాట్ల దుర్గాప్రసాద్ అన్నయ్యతో కలిసి అద్దంకి, తిమ్మాయపాలెం గుండ్లకమ్మ నది బ్రిడ్జిపై నడుచు కుంటూ వెళుతూ బ్రిడ్జిపై నుండి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నదిలో దుర్గాప్రసాద్ మృత దేహం కోసం గాలించారు. నర్రావారిపాలెం సమీపంలో మృతదేహం బయట పడింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహారావు

యానిమేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని డ్వాక్రా యానిమేటర్లకు వాలంటీర్లుగా ఉల్లాస శిక్షణ స్థానిక సమైక్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎంపిడిఒ నరసింహారావు మాట్లాడారు. ఎపిఎం గాలి రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ యానిమేటర్లు గ్రూపులోని చదువురాని సభ్యులకు రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు వయోజన విద్య ఉల్లాసంపై శిక్షణ ఇవ్వాలని చెప్పారు. 2030 నాటికి నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించే దిశలో కృషి చేయాలని చెప్పారు. పాఠశాలకు అనేక కారణాల వలన వెళ్ళని 15ఏళ్ల పైబడిన అందరికీ వయోజన విద్య అక్షరాలు నేర్పించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సమైక్య సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

మద్యం షాపుపై పోటాపోటీ నినాదాలు

- మద్యం షాపు వద్దని ఆందోళన
- అక్కడే మద్యం షాపు కావాలని మరో గ్రూపు నినాదాలు

ప్రజాశక్తి - వేటపాలెం

మద్యం షాపు కావాలని ఒక వర్గం, మద్యం షాపు వద్దని మరోవర్గం పోటా పోటీగా నినాదాలతో హెూరెత్తిం చారు. చీరాల నుండి ఒంగోలు వెళ్లే ఆర్ అండ్ బి రహ దారిపై అరగంటసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అధికార పార్టీ అండదండలు మెండుగా ఉన్న నాయకులు ఆర్ అండ్ బి రోడ్డుకు అడుగు దూరంలో ప్రధాన కూడలి దగ్గరగా గాయత్రి వైన్స్ షాప్ నెలకొల్పేందుకు సిద్ధమయ్యారు. స్థానికులు విషయం తెలుసుకొని రోడ్డెక్కి నివాస గృహాల మధ్య రోడ్డు వెంట మద్యం షాపు ఎలా పెడతారంటూ రోడ్డుపై బైఠాయించారు. మరోవైపు మద్యం షాపు నిర్వాహకులు షాపు పెట్టేదేనంటూ భీష్మించారు. ఇక్కడ మద్యం షాపు పెట్టొద్దంటూ రోడ్డుపై బైఠాయించిన వ్యక్తులు నినాదాలు చేస్తుంటే మద్యం షాపు కావాలంటూ మరోవర్గం రోడ్డెక్కడంతో ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడి ఏదైనా సమస్య ఉంటే ఉన్నత అధికారులకు నివేదించు కోవాలని, ట్రాఫిక్ అంతరాయం కలిగించవద్దని సర్ది చెప్పారు. పోలీసులు ట్రాఫిక్కును క్లియర్ చేసి ఆందోళన కారులను పంపించి వేశారు. మద్యం షాపు నిర్వాహకులు మాత్రం షాప్ ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. దీంతో ఆందోళనకారులు తహశీల్దారు పి పార్వతికి మద్యం షాపు తొలగించాలని వినతి పత్రం అందజేశారు.

రోడ్డుపై బైటాయించిన ఆందోళన కారులతో ఎస్ఐ వెంకటేశ్వర్లు

బారక్‌పూర్ తిరుగుబాటు అజరామరం

ప్రజాశక్తి - బాపట్ల

ఆంగ్లేయుల ఆరాచకాలకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన మొట్ట మొదటి పోరాటం బారక్ పూర్ తిరుగు బాటని సాంఘిక సంక్షేమ సాధికారత జిల్లా అధికారి జె రాజా దెబోర అన్నారు. బారక్ పూర్ తిరుగుబాటు ద్వి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలలో నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎం సర్దార్ బేగ్ అధ్యక్షత వహించారు. బారకపూర్ తిరుగుబాటు భారత స్వాతంత్రోద్యమ పోరాటంలో మహెూజ్వల ఘట్టమన్నారు. ఈ తిరుగుబాటే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రమానికి నాంది ప్రస్తానంగా నిలిచిందన్నారు. ఈ తిరుగుబాటు నాయకుడు భింది తివారిని ఆంగ్లేయులు అతి కిరాతకంగా ఉరితీసారు. ఈ తిరుగుబాటులో అసువులు బాసిన వారందరి రుణం తీర్చుకోలేనిదని అన్నారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చరిత్ర తెలుసుకొని, స్ఫూర్తి పొంది, దేశం కోసం త్యాగాలు చేయాలని కోరారు. తొలుత బిందీ తివారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. బారక్ పూర్ తిరుగుబాటు పై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిపిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. షేక్ సంజయ్ సుల్తానా, యు రూపవతి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో అధ్యాపకులు సోమశేఖరరావు, గౌతమి, బ్లెస్సిసాగర్, వంకాయలపాటి హరిబాబు, భార్గవ్, చినభూషణం, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజాదెబోరా

ప్రభుత్వం కేటాయించిన స్థలం అప్పగించరా?

స్మశాన స్థలం కోసం ఎదురు చూస్తున్న దళిత కాలనీవాసులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నో ఏళ్ళుగా దళితులకు స్మశాన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారికి స్థలాలు కేటాయించాలని ప్రజా సంఘాలు సైతం ఆందోళన చేపడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో గతేడాది ఏప్రిల్ నెలలో మండలంలోని పెదలంక, మధ్య గూడెం దళితవాడకు అప్పటి ప్రభుత్వం అదే గ్రామంలో సర్వేనెంబర్ 102/1ఎ,102/1సిలో 2.32 ఎకరాల రెవెన్యూ పోరంబోకు భూమిని స్మశాన వాటికకు కేటాయించారు. దీనిని అప్పటి కలెక్టర్ విజయకృష్ణన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ స్థలంలో అప్పటికే అనధికారికంగా గ్రామానికి చెందిన ఓ అగ్రవర్ణ రైతు సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిని స్మశాన వాటికకు అప్పగించేందుకు రైతు ఖాళీ చేయకపోగా ఎలాంటి ఆధారాలు లేకుండా కోర్టును ఆశ్రయించాడు. రైతు వేసిన పిటిషన్లు పరిశీలించి నాలుగు నెలల్లోగా ఈ భూమికి సంబంధించిన ఆధారాలను కోర్టుకు అందజేయాలని కోర్టు నుండి సమయం కేటాయించారు. కానీ ఏడాది గడిచినప్పటికీ రైతు కోర్టుకు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. ఈ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్న రైతు తన కొడుకులు, కూతుళ్లు, కోడళ్ళ పేరున గ్రామంలో దాదాపు 16ఎకరాల సొంత భూమి ఉందని, దానిని తహశీల్దారు అధికారులే నిర్ధారించినప్పటికీ దళితులకు మాత్రం స్మశానం కింద స్థలాన్ని అప్పగించేందుకు అధికారులు ముందుకు రావడం లేదని దళితవాడ వాసులు ఆరోపిస్తున్నారు. ఖాళీ ప్రభుత్వ పోరంబోకు భూమిని దళితులకు స్మశాన స్థలం కింద కేటాయిస్తున్నట్లు కలెక్టర్ నుండి స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ మండల స్థాయి అధికారులు దాన్ని అమలు చేయడంలో విఫలం చెందారని ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. ఎకరాల కొద్దీ భూమి ఉన్న రైతు నుండి ఈ పోరంబోకు భూమిని అధికారులు ఎందుకు స్వాధీన చేసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అగ్ర వర్ణాల వారికి అధికారులు వత్తాసు పలుకుతూ ప్రభుత్వం దళిత స్మశానం స్థలం కోసం కేటాయించినప్పటికీ భూమిని అప్పగించటానికి ముందుకు రాకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంపై తహశీల్దారు ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ స్థలంపై రైతులు కోర్టులు ఆశ్రయించారని, పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

పెదలంక దళితుల స్మశాన వాటికకు కేటాయించిన స్థలం

క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - చీరాల

రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తంగా రోటరీ సామాజిక భవనం నందు యువజన వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు చిన్నారులకు ఫాన్సీ డ్రెస్సెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటిల్లో 56 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శనివారం 6వ రోజు క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి 210 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ మాస్టార్‌గా దోగుపర్తి వెంకట సురేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, వలివేటి మురళీకృష్ణ, పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్, డాక్టర్ ఐ బాబూరావు, గుర్రం రాఘవరావు, సందు నాగరాజు, రమేష్ బాబు, ఎంవి రామారావు, మామిడాల శ్రీనివాసరావు, జివై ప్రసాద్, టి లక్ష్మీప్రతాప్, చుక్కా శ్రీనివాసరావు, సుభాషిణి, భాను, షజీద, తవ్వా పద్మ, రూపా దేవి పాల్గొన్నారు.

ఎరువులు దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎఒ సుమతి

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - చీరాల

రైతులు ఎరువుల కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులున్న నేరుగా పిర్యాదు చేయాలని వ్యవసాయశాఖ అధికారి సుమతి కోరారు. ఎరువులు దుకాణాల్లో శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ తనిఖీలో డీలర్లు రైతులు అడిగిన ఎరువులు మాత్రమే విక్రయిస్తున్నారని అన్నారు. కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తామనే షరతులు లేవని తెలిపారు. రైతు వద్ద నుండి లిఖిత పూర్వక ఫిర్యాదు తమకు అందలేదని అన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో గరిష్ట రిటైల్ ధరకే ఎరువులు విక్రయిస్తున్నారని తెలిపారు. బిల్లు బుక్స్ పరిశీలించినట్లు తెలిపారు. ఎవరైన అధిక ధరలకు విక్రయిస్తే ఎఫ్‌సిఓ 1985 చట్టం ప్రకారం శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షునిగా సుమన్

ప్రజాశక్తి - పర్చూరు

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షునిగా పర్చూరుకు చెందిన లక్కిపోగు సుమన్ నియమితులయ్యారు. నూతన కార్యాలయం శనివారం ప్రారంభించారు. జాతీయ అధ్యక్షులు చెన్నుపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ స్థాపనే హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉద్దేశమన్నారు. దేశంలోని అన్ని రంగాలు అవినీతిలో కూరుకుపోయాయని అన్నారు. వాటిని ప్రక్షాళన చేసి నిజాయితీగా ఉద్యోగ ధర్మం నిర్వర్తించే వారికి కౌన్సిల్ అండగా ఉంటుందని తెలిపారు. ఎక్కడ అవినీతి జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి నందం నరసింహారావు, ఎపి అధ్యక్షులు జెర్రిపోతుల నానాజీ, ఉపాధ్యక్షులు జి రాంబాబు, సౌత్ ఇండియా మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, లీగల్ కార్యదర్శి రాజ్యలక్ష్మి, జిల్లా మీడియా ఇంచార్జి వీరభద్రం, విశ్రాంత ఎస్పీ లక్కిపోగు డేవిడ్ పాల్గొన్నారు.

పాలనపై కమిషనర్ మార్క్..!

- రెవెన్యూ ఇన్స్పెక్టర్ల మార్పుతో సంచలనం
- ఒంగోలు కార్పొరేషన్‌లో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాలనలో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. కార్పొరేషన్ ఉద్యోగుల పనితీరుపై ప్రత్యేక నిఘా పెట్టారు. అవినీతిపరులను, పనిచేయని వారిని పక్కన పెడుతున్నారు. కొన్ని రోజుల కిందట శానిటేషన్ విభాగంలో మేస్త్రీలుగా పనిచేస్తున్న సుమారు వంద మందిని ఆ స్థానాల నుంచి కదిలించి సంచలనం సృష్టించారు. ఈ నిర్ణయం పట్ల భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కమిషనర్ తీసుకున్న మరో నిర్ణయం కార్పొరేషన్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఏళ్ల తరబడి సీట్లలో పాతుకుపోయిన రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఆ స్థానాల నుంచి కదిలించారు. పాత వారందరినీ పక్కనపెట్టి కొత్తగా నలుగురికి మాత్రమే అవకాశం కల్పించారు. గతంలో పనిచేస్తున్న ఎనిమిది మంది రెవెన్యూ ఇన్స్పెక్టర్లను పక్కనపెట్టి ఆ స్థానంలో కొత్తవారు నలుగురికి స్థానాలు కేటాయించారు. రెండు రోజుల క్రితమే ఈ మేరకు ఆయన ఉత్తర్వులు ఇచ్చారు. పాత వారికి వేరే పనులను అప్పగించారు. నగరపాలక సంస్థలో రెవెన్యూ విభాగం చాలా కీలకమైంది. కార్పొరేషన్‌కు ఆదాయ వనరులను సమకూర్చడంలో ఈ శాఖ పనితీరు చాలా ముఖ్యమైంది. అయితే ఈ శాఖలో రెవెన్యూ సిబ్బంది అవినీతికి అలవాటు పడి కార్పొరేషన్ పరువును దిగజారుస్తున్నారు. అక్రమార్జనకు పాల్పడుతున్నారు. వీరి మీద కొన్ని సంవత్సరాలుగా అనేక ఆరోపణలు ఉన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు వ్యవహరించారు. రెవెన్యూ సిబ్బంది అవినీతిలో పూర్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యం అయ్యి ప్రజలను దోచుకోవడం పరిపాటిగా మారిందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ వెంకటేశ్వరరావు తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఏదో ఒక రాజకీయ నాయకుడి అండతో కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో గత అనేక సంవత్సరాలుగా ఎనిమిది మంది సిబ్బంది రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా చలామణి అవుతున్నారు. వీరికి రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా పనిచేసే అర్హత లేకపోయినా ఇన్‌ఛార్జీలు, వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఆ స్థానాలను గతంలో పనిచేసిన అధికారులు కట్టబెట్టారు. కొత్తగా పన్నులు వేయాలన్నా, ఆస్తి పన్నుల్లో పేర్లు మార్పు చేయాలన్నా వీరికి చేతులు తడపాల్సిందే.. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడడం పరిపాటిగా మార్చారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ల అవినీతి మీద అనేక ఫిర్యాదులు ఉన్నా గతంలో పనిచేసిన కమిషనర్లు ఎవ్వరూ పట్టించుకోలేదు. కార్పొరేషన్ పాలకవర్గ పెద్దలు సైతం రెవెన్యూ ఇన్స్పెక్టర్లకు వత్తాసు పలుకుతూ వస్తున్నారు. ఈ క్రమంలో గతంలో పనిచేస్తున్న ఎనిమిది మంది రెవెన్యూ ఇన్స్పెక్టర్లను, ఇద్దరు రెవెన్యూ అధికారులను పక్కనపెట్టి ఆ స్థానంలో ఒక కొత్త రెవెన్యూ అధికారిని, నలుగురు కొత్త రెవెన్యూ ఇన్స్పెక్టర్లను కమిషనర్ నియమించడం కార్పొరేషన్ వర్గాల్లో పెద్ద చర్చగా మారింది. కమిషనర్ నిర్ణయం పట్ల అభినందనలు వెలువెత్తుతున్నాయి. పలువురు కార్పొరేటర్లు కూడా 'శభాష్ కమిషనర్' అంటూ ఆయనను మెచ్చుకుంటున్నారు.

ప్రతి పేదవాడికీ జీవనోపాధి కల్పించాలి

కలెక్టర్ వెంకటమురళి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉపాధి హామీ చట్టం ద్వారా అర్హులైన ప్రతి పేదవాడికీ జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం ఈ నెల ఐదో తేదీన ఉన్నందున ముందస్తుగా జిల్లా అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ అనుసంధానంతో బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతాలన్నిటిలో విస్తతంగా మొక్కలు నాటి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ చెప్పారు. పచ్చదనం, పరిశుభ్రత పాటించేలా డ్వామా, అటవీ, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అన్ని ప్రాంతాలకు సమంగా ఉండేలా చూడాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. జిల్లాలో పంట కాల్వల మరమ్మతులకు మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కెడబ్ల్యూడి, ఎన్ఎస్‌పి కింద జిల్లాకు మంజూరైన రూ.14 కోట్లతో పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాకు 50,415 గహాలు మంజూరు కాగా, 16,362 గహాలు పూర్తయ్యాయన్నారు. వంద రోజుల్లో 3,064 గహాలను డిసెంబర్ నెలాఖరికి పూర్తి చేయాలని లక్ష్యంగా పనులు చేయాలన్నారు. 19,790 ఎన్టీఆర్ గహాల లబ్ధిదారులకు నిలిచిన నిధులను ఇవ్వడానికి సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. టిడ్కో గహాల నిర్మాణంపై సమగ్ర ప్రణాళికలు రూపొందించి నివేదించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటిలోని ప్రతి ఇంటికీ తాగునీటిని పుష్కలంగా సరఫరా చేయాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, చీరాల మున్సిపల్ కమిషనర్ గ్రెవ్వాజరుపై ఛార్జ్ మెమో ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిపిఒ శ్రీనివాసరావు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుంతల రహిత కార్యక్రమానికి శ్రీకారం

రహదారి మరమ్మతులు చేసే పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రహదారులపై ప్రమాదాలు నివారించడానికి గుంతల రహిత కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా బాపట్ల మండలం ఈతేరు వద్ద గుంతలు పూడ్చి రహదారి మరమ్మతు చేసే పనులను కలెక్టర్ శనివారం ప్రారంభించారు. రహదారులపై సుఖ ప్రయాణం జరగాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ చెప్పారు. ఇందు కొరకు జిల్లాలో 319 కిలోమీటర్ల మేర రహదారులకు గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. మరమ్మతుల కోసం బాపట్ల జిల్లాకు రూ.16 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో రాష్ట్రీయ రహదారులు ఆర్అండ్‌బి ప్రధాన రహదారులు, గ్రామాలలోని రహదారులకు మరమ్మతులు చేస్తామన్నారు. బాపట్ల నియోజకవర్గంలోని రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.24 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. గుంటూరు-చీరాల రహదారి ఈతేరు నుంచి నాగరాజు కాల్వ వరకు 9 కిలోమీటర్ల పొడవున గుంతలు పూడ్చి, తాత్కాలిక మరమ్మతులు చేయడానికి రూ.23 లక్షలతో పనులు చేస్తున్నామన్నారు. గుంతలతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి.. ప్రభుత్వం ఈ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి గ్లోరియా, ఆర్అండ్ బి ఈఈ గీతారాణి, డి.అరుణ, తహశీల్దార్లు పాల్గొన్నారు.

మేస్త్రీలుగానే కొనసాగించాలని నిరసన

నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలను మేస్త్రీలుగానే కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మేస్త్రీలు శనివారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.మహేష్ మాట్లాడుతూ మేస్త్రీలుగా విధులు నిర్వహిస్తున్నా మస్టర్ వేయకుండా వేతనాలు ఆపడం జరిగిందని, ఇలాంటి చర్యలపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపాలని, అక్టోబర్ నెల వేతనంతో కూడిన మస్టర్ వేసి వేతనాలు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో కార్మికులు అందరూ కలిసి ఐక్య పోరాటాలకు సన్నద్ధం అవుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మికులు కె.ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, సిహెచ్ వెంకటేశ్వర్లు, నవీన్, గోపి మనోహర్, వెంకట్రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కసరత్తులు

ప్రజానీకానికి ఇచ్చిన హామీలు అమలుచేసేందుకు పాలకపక్షం కసరత్తులు ఆరంభించింది. మొన్నటివరకూ ఇప్పుడే కదా? అధికారంలోకి వచ్చిందని చెప్పుకుంటూ వచ్చారు. వంద రోజులకు వచ్చేసరికి ఏం చెప్పాలో తెలియక తిరుపతి లడ్డూను తెరపైకి తెచ్చి కొంతకాలం దుమారం రేపుతూ గడిపారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కుస్తీలు పడుతున్నారు. ఏం చేయాలనే దానిపై ఇప్పుడు దృష్టి సారించారు. పాలనపై పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఎట్టకేలకు జిల్లాలో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును జిల్లాకు ఆహ్వానించారు. ఆయనతో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి ప్రాజెక్టును సందర్శించారు. రెండేళ్లలో పూర్తిచేస్తామని ప్రకటించారు. ఇప్పుడు నిధులే పెద్ద ఎజెండాగా ఉంది. సిఎం చంద్రబాబు చేతిలోనే ఇప్పుడు వెలిగొండ భవితవ్యం ఉందని స్పష్టమైంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన ఆనం రామనారాయణరెడ్డి జిల్లాకు వచ్చారు. కూటమి నేతలతో భేటీ నిర్వహించారు. జిల్లా అభివృద్ధికి కూటమి ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. పలు అంశాలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో చర్చించారు. భవిష్యత్ కర్తవ్యాలు ఎలా అమలు చేయాలనే దానిపైనే దృష్టి సారించారు. ఈ దిశగా తొలి అడుగులు మొదలయ్యాయి.

కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటి ఎట్టకేలకు ఆచరణలోకి వచ్చింది. నాలుగు నెలల తర్వాత ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలులోకి వచ్చింది. గ్యాస్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో నగదు జమకానుంది. మొదటి సిలిండర్ రాయితీ పొందేందుకు వచ్చే ఏడాది మార్చి వరకూ గడువు పెట్టారు. ఏడాదికి ఈ లెక్కన మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నారు. మిగతా హామీలు ఎప్పుడు అమలు చేస్తారోనన్న చర్చ ప్రజానీకంలో ఉంది.

ఆదాయాల కోసం పాలకపక్ష నేతలు ఎన్నడూలేని విధంగా అడ్డదారుల్లో వెళుతున్నారనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. సిఎం చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తున్నా దందాలు మాత్రం ఆగడం లేదు. మద్యం విషయంలో జోక్యం ఎక్కువగా ఉంది. సిండికేట్లను ఎమ్మెల్యేలే పర్యవేక్షిస్తున్నారు. వాటాలూ అడుగుతున్నారు. మద్యం ధరలూ ఎక్కువగానే ఉన్నాయి. బెల్టు దుకాణాల నిర్వహణకు పెద్దఎత్తున వ్యూహాలు నడుస్తున్నాయి. ఊరూవాడా మద్యం ఏరులై పారుతోంది. కొత్త మద్యం విధానం అంటే ఇదేనా? అనే చర్చ సాగుతోంది. ఇంకా ఇసుక, రేషన్ బియ్యం, గ్రానైట్ రంగాల్లో యథేచ్ఛగా వసూళ్ల పర్వం సాగుతోంది. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే ఆలోచన కూడా ఈ సారి పాలకపక్షం చేయడం లేదు. అధికారంలో ఉన్నందున ఇప్పుడే అన్నీ చక్కదిద్దుకోవాలనే ఆలోచన మాత్రమే నేతల్లో కనిపిస్తోంది.

నిధుల కొరత వల్ల ఏ పనులూ వేగంగా మాత్రం ముందుకు సాగడం లేదు. అభివృద్ధి పనులు కొత్తగా ఏమీ కనిపించడం లేదు. చెల్లింపులకు నిధులు అడుగుతున్నారు. కొత్తగా ఏమైనా పనులు వస్తే వాటిని చేయడానికే కాంట్రాక్టర్లు, నేతలు జంకుతున్నారు. పేమెంట్స్ వస్తాయా? లేదా? అంటున్నారు. గతంలో చేసిన పనులకు కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నీరు-చెట్టు పనుల బిల్లులు కూడా ఇటీవల జడ్జీలో చర్చకు వచ్చాయి. వాటి కోసం ఎదురుచూస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన సచివాలయాల భవనాల బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోయాయి. అవన్నీ వస్తాయా? లేదా? అనే దానిపై తర్జనభర్జన సాగుతోంది.

రబీ ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఖరీఫ్‌లో వేసిన పంటలు కొంతమేరకు దెబ్బతిన్నాయి. రబీ పంటలకు పెద్దగా నష్టం లేదు. ఇప్పుడు రబీలో మిగతా పంటల సాగు పెరిగినుంది. పొగాకు, వరి, శనగ మిర్చి వంటి పంటల సాగు పెరగనుంది. ఈ ఏడాది పొగాకు ధరలు బాగా ఉన్నందున ఎక్కువమంది దీనిపై దృష్టి సారించారు. ఏ పంటకు ధరలు ఎక్కువగా ఉంటే వాటిని సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో ధరలపై ఒడిదుడుకులు రైతులను కలవరపెడుతున్నాయి. సాగుపైనే ప్రభావం చూపుతున్నాయి.